జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | 6 | అక్టోబర్ | 2026 ◆ పేజీలు : 8



## విద్యార్థుల అభ్యాసనకు అనుకూల వాతావరణం కల్పించాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్ ,అక్టోబర్ 5, (ప్రజా జ్యోతి)** జూలూరుపాడు మండలం కొమ్ముగూడెం గ్రామం లోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, పరీక్షల నిర్వహణ, విద్యార్థుల హాజరు, మౌలిక సదుపాయాలు, పోషకాహారం తదితర అంశాలను పరిశీలించారు. పాఠశాలలో నిర్వహిస్తున్న ఎస్ఏ–1 పరీక్షలను కలెక్టర్ పరిశీలించారు. వివిధ తరగతుల విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తీరును గమనించి, వారు రాస్తున్న ప్రశ్నపత్రాలను పరిశీలించారు. పరీక్షల నిర్వహణ విధానం, విద్యార్థుల అభ్యసన స్థాయి

మిగతా 2 లో...

## ప్రజాజ్యోతి ఎఫెక్ట్
# తనిఖీల పేరుతో దోపిడీ?



- **పేరుకే ప్రభుత్వ ఉద్యోగులు.. తనిఖీలు నామమాత్రమేనా?**

**అశ్వారావుపేట: ప్రజా జ్యోతి అక్టోబర్ 5** అశ్వారావుపేట మండలంలో జరుగుతున్నటువంటి ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్న కథనాల నేపథ్యంలో సంబంధిత అధికారులు తనిఖీలకు దిగుతున్నప్పటికీ.. ఆ తనిఖీలు ఎంతవరకు నిబంధనల ప్రకారం జరుగుతున్నాయన్న ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా మెడికల్ షాపుల తనిఖీల విషయంలో సర్టిఫికెట్లు ఒకరి పేరుపై ఉండగా.. వ్యాపారం నిర్వహించేది మరొకరా? అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తనిఖీలు నిర్వహిస్తున్నామని చెబుతున్న రాందాస్ అసలు అర్హతలు ఏమిటి? ఆయన ఏ హోదాలో తనిఖీలు నిర్వహిస్తున్నారు? ఆయనకు తనిఖీల నిర్వహణకు ఉన్న అధికార పరిధి ఎంత? అన్న అంశాలపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

తనిఖీల తేదీలు.. నమోదైన కేసులెన్ని?

తనిఖీలు నిర్వహించినట్లు చెబుతున్న అధికారులు ఏ తేదీన, ఏ మెడికల్ షాపులో తనిఖీలు నిర్వహించారు? తనిఖీల్లో ఎలాంటి ఉల్లంఘనలు గుర్తించారు? ఎన్ని కేసులు నమోదు చేశారు? ఎవరిపై చర్యలు

మిగతా 2 లో...



- మామిడిగుండాల భూ సమస్య పరిష్కారమే ధ్యేయం
- 4,200 ఎకరాలపై సమగ్ర సర్వేకు శ్రీకారం
- 2,400 ఎకరాల అసైన్డ్ భూములపై అర్హత పరిశీలన
- ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య చొరవతో కదిలిన యంత్రాంగం

# రైతు భూములకు హక్కులే లక్ష్యం

**ఇల్లందు, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి )** భూమిని నమ్ముకుని జీవిస్తున్నమామిడిగుండాల రైతుల చిరకాల భూ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం చేపడుతున్న చర్యలు స్థానిక రైతుల్లో కొత్త ఆశలు రేకెత్తిస్తున్నాయి. ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములకు చట్టబద్ధమైన హక్కులు కల్పించాలనే రైతుల ఆకాంక్షకు అనుగుణంగా రెవెన్యూ అధికారులు సమగ్ర చర్యలకు పూనుకున్నారు. గ్రామం లోని సుమారు 4,200 ఎకరాల భూములపై సమగ్ర సర్వే చేపడుతుండగా, అందులోని 2,400 ఎకరాల అసైన్డ్ భూములపై అర్హులైన అనుభవదారులను గుర్తించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. సోమవారం మామిడిగుండాల గ్రామంలో ప్రత్యేకంగా నిర్వహించిన రైతు సభలో ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, ఆర్డీవో మధు, తహసీల్దార్ షాఖాసీం పాల్గొని రైతుల

మిగతా 2 లో...

- హైకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తునకు ఆదేశం...
- పోలవరం ఘటనపై నల్లపు మణిదీప్ నివేదికకు సుప్రీంకోర్టు ఆమోదం..పిల్ గా నమోదు..!
- ఏడేళ్ల జమున మృతిపై సుప్రీం చీఫ్ జస్టిస్ ధర్మాసనం కీలక ఉత్తర్వులు...
- ఏపీలో 100 మంది చిన్నారులకు క్లోరోక్విన్ వికటింపు..

## ఏపీ క్లోరోక్విన్ విషాదంపై
# సుప్రీం సీరియస్

సుప్రీం దృష్టికి తెలంగాణ పినపాక లాయర్ పోరాటం...

- క్లోరోక్విన్ కేసును ఏపీ హైకోర్టుకు బదిలీ చేసిన సుప్రీంకోర్టు.. నిరంతర పర్యవేక్షణకు ఆదేశం...

2 లో...




## ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి



- జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం కలెక్టరేట్ ,అక్టోబర్05, (ప్రజా జ్యోతి)** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తక్షణమే వాటిని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు, సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, డిఆర్ఓ పద్మావతి తో కలిసి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ

మిగతా 2 లో...

## విద్యార్థుల అభ్యాసనకు అనుకూల వాతావరణం కల్పించాలి

(మొదటి పేజీ తరువాయి...)

తదితర వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పాఠశాలలో మొత్తం 73 మంది విద్యార్థులు ఉండగా, సోమవారం 62 మంది విద్యార్థులు హాజరైనట్లు ఉపాధ్యాయులు కలెక్టర్‌కు వివరించారు. విద్యార్థుల హాజరు శాతం మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని, గైర్హాజరవుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో సమన్వయం చేసుకొని విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని కలెక్టర్ సూచించారు. అదేవిధంగా పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను కలెక్టర్ పరిశీలించారు మన ఊరు–మన బడి' కార్యక్రమం కింద పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో చేపట్టిన పనులు, వాటి ప్రస్తుత పరిస్థితి, విద్యార్థులకు వాటి ద్వారా కలుగుతున్న ప్రయోజనాలపై వివరాలు తెలుసుకున్నారు.అనంతరం పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న ప్రీ–ప్రైమరీ పాఠశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. అక్కడ 14 మంది చిన్నారులు విద్యనభ్యసిస్తున్నట్లు తెలుసుకున్న ఆయన, వారికి అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. చిన్నారులకు నూతనంగా అందించనున్న ఏకరూప దుస్తులను పరిశీలించారు. వారి వయస్సుకు అనుగుణంగా విద్యాబోధన జరుగుతున్న తీరును, చిన్నారులకు కల్పిస్తున్న అభ్యసన వాతావరణాన్ని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులు ఆటల ద్వారా ఉల్లాసంగా నేర్చుకునేలా పాఠశాలలో ఏర్పాటు చేసిన బొమ్మలు, ఆట వస్తువులను కలెక్టర్ పరిశీలించారు. తరగతి గదుల్లో పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చూడాలని, ఆటలు, బొమ్మలు, ఇతర అభ్యసన సామగ్రిని వినియోగిస్తూ చిన్నారుల్లో ఆసక్తిని పెంపొందించాలని సూచించారు.విద్యార్థులకు అందిస్తున్న పోషకాహారంపై కూడా కలెక్టర్ ఆరా తీశారు. ఉదయం 11 గంటలకు రాగిజావ, అనంతరం విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన, పోషక విలువలతో కూడిన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.పాఠశాలలో విద్యార్థులకు అభ్యసనకు అనుకూలమైన వాతావరణం కల్పించడంతో పాటు వారి హాజరు, విద్యా ప్రమాణాలు, ఆరోగ్యం, పోషకాహారంపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన తెలిపారు . ఈ తనిఖీలు కలెక్టర్ వెంట తాసిల్దార్ శ్రీనివాస్, ఎంఈఓ జుంకీ లాల్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు భూములకు హక్కులే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి...)

సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. భూ సమస్యలకు పారదర్శక పరిష్కారం చూపేందుకు అనుసరించాల్సిన కార్యాచరణపై రైతులతో క్షేత్రస్థాయిలో చర్చించారు.

**రైతులకు పూర్తి న్యాయం జరగాలి:ఎమ్మెల్యే కోరం కనకయ్య**

మామిడిగుండాల భూ సమస్యను పరిష్కరించేందుకు రెవెన్యూ యంత్రాంగం నిబద్ధతతో కృషి చేయాలని ఆదేశించారు. తరతరాలుగా భూములను సాగు చేసుకుంటున్న పేద రైతులకు హక్కుల విషయంలో స్పష్టత రావలసిన అవసరం ఉంది. సర్వే నిర్వహించే సమయంలో క్షేత్రస్థాయి వాస్తవాలను, సాగుదారుల పరిస్థితిని ప్రధానంగా పరిగణనలోకి తీసుకోవాలి. ఒక్క అర్హుడైన రైతుకు కూడా అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వారికి హక్కు పత్రాలు లభించే వరకు తన వంతు సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు.

**క్షేత్రస్థాయి వాస్తవాల ఆధారంగానే సర్వే:ఆర్డీఓ మధు**

భూ సమస్య పరిష్కారంలో క్షేత్రస్థాయి పరిశీలనే ప్రామాణికమని ఆర్డీఓ మధు స్పష్టం చేశారు. కేవలం రికార్డులను మాత్రమే కాకుండా, భూముల వాస్తవ పరిస్థితులు, ప్రత్యక్ష సాగు అనుభవాన్ని సమగ్రంగా తనిఖీ చేసి అర్హతను నిర్ధారిస్తామని వివరించారు. రైతులు తమ వద్ద ఉన్న భూ సంబంధిత పత్రాలను అందుబాటులో ఉంచుకుని, సర్వే అధికారులకు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు.

**అర్హులైన అనుభవదారుల గుర్తింపు:తహసీల్దార్ షా ఖాసీం**

మామిడిగుండాల పరిధిలోని సుమారు 2,400 ఎకరాల అసైన్డ్ భూములపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. మొదటి దశలో ప్రభుత్వ కార్యాలయాలు, రహదారులు, దేవాలయాలు మరియు గ్రామ అవసరాలకు కేటాయించిన భూములను సరిచూస్తామని, ఆ తర్వాత మిగిలిన భూముల్లో అర్హులైన అనుభవదారులను గుర్తించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

**హక్కుల పత్రాలపైనే రైతుల ఆశలు**

మామిడిగుండాల రైతులకు భూమి కేవలం ఆస్తి మాత్రమే కాదని, అది వారి జీవనాధారమని గ్రామస్థులు పేర్కొన్నారు. సమగ్ర సర్వే పారదర్శకంగా జరిగి, అర్హులైన ప్రతి ఒక్కరికీ పట్టాలు అందజేస్తేనే ఈ సర్వేకు పూర్తి ప్రయోజనం చేకూరుతుందని ఆశిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు నేరుగా గ్రామానికి వచ్చి చర్చించడం సమస్య పరిష్కారంపై సానుకూల వాతావరణాన్ని నింపింది.ఈ కార్యక్రమంలో డిఎస్పి యు వెంకన్న, ఎంపీడీఓ దన్ సింగ్, డిప్యూటీ తహసీల్దార్, సర్వేయర్లు, పంచాయతీ అధికారులు, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# ఏపీ క్లోరోక్విన్ విషాదంపై సుప్రీం సీరియస్

**తెలంగాణ హైకోర్టులో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే పినపాక యువ న్యాయవాది గా నల్లపు మణిదీప్ కు మంచి గుర్తింపు లభించింది. ముఖ్యంగా గిరిజన, పేద ప్రజల హక్కుల కోసం అనేక పిల్ లు వేసి న్యాయం సాధించారు. న్యాయవాద వృత్తినే కాకుండా సామాజిక సేవను బాధ్యతగా తీసుకుని ముందుకు సాగుతున్నారు. ఏపీ పోలవరం ఏజెన్సీలో క్లోరోక్విన్ వికటించి 100 మంది చిన్నారులు ఆసుపత్రి పాలైన ఘటనలో ఆయన స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి వివరాలు సేకరించి సుప్రీంకోర్టుకు నివేదిక ఇవ్వడం ఆయన నిబద్ధతకు నిదర్శనం. గిరిజన బాలిక జమున మృతికి పరిహారం ఇవ్వకపోవడం, వైద్య సదుపాయాల లేమిని ఆయన నివేదికలో స్పష్టంగా పేర్కొన్నారు. దీంతో ఆయన నివేదికను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం స్వీకరించి పిల్ గా నమోదు గమనార్హం.**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిది / పినపాక, అక్టోబర్ 5, ప్రజాజ్యోతి...**

ఆంధ్రప్రదేశ్ లోని పోలవరం ఏజెన్సీలో క్లోరోక్విన్ మాత్రలు వికటించి 53 గ్రామాల్లో 100 మందికి పైగా గిరిజన చిన్నారులు ఆసుపత్రుల పాలవడం, ఏడేళ్ల బాలిక మాడివి జమున మృతి చెందిన విషాద ఘటనపై దేశ అత్యున్నత న్యాయస్థానం కీలకంగా స్పందించింది. మృతురాలి కుటుంబానికి ఇప్పటివరకు ఎలాంటి పరిహారం అందలేదని, స్థానికంగా అత్యవసర వైద్య సదుపాయాలు లేకపోవడంతో చిన్నారుల ను తెలంగాణకు తరలించాల్సి వచ్చిందని తెలంగాణ హైకోర్టు న్యాయవాది పినపాకకు చెందిన నల్లపు మణిదీప్ సమర్పించిన నివేదికను సుప్రీంకోర్టు పరిగణన లోకి తీసుకుంది. ఈ నివేదిక ఆధారం గా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వం లోని త్రిసభ్య ధర్మాసనం డబ్ల్యూపీ సీరియల్ నెం 386/2026 కింద దీనిని ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్ ) గా నమోదు చేసి విచారణ చేపట్టింది.

**నల్లపు మణిదీప్ పోరాటం గిరిజనులకు న్యాయం...**

ఈ ఘటన సాధారణమైంది కాదని, గిరిజన చిన్నారుల ప్రాణాలకు సంబంధించిన అంశం కాబట్టి నిరంతర న్యాయ పర్యవేక్షణ అవసరమని ధర్మాసనం అభిప్రాయపడింది.అందులో భాగంగా ఈ కేసును ముఖ్యమైన కేసుగా పరిగణించి దర్యాప్తును ప్రత్యక్షంగా పర్యవేక్షించే బాధ్యతను ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ లాయర్, పినపాకకి చెందిన నల్లపు మణిదీప్ చేసిన పోరాటానికి సుప్రీం స్థాయిలో గుర్తింపు లభించడంతో గిరిజన కుటుంబాలకు న్యాయం జరిగే అవకాశం ఏర్పడిందని న్యాయవర్గాలు చెబుతున్నాయి.

## ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి

(మొదటి పేజీ తరువాయి...)

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమం ముఖ్యమైన వేదికగా నిలుస్తోందన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి దరఖాస్తును ప్రాధాన్యతతో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చిన కొన్ని వినతులు గుండాల మండలం కాంచనపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని జగ్గు తండాకు చెందిన బానోత్ చాందిని తన భూమికి సంబంధించిన సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సర్వే నంబర్ 31, ఖాతా నంబర్ 33లో ఉన్న భూమిని గతంలో సర్వేయర్ ద్వారా సర్వే చేయించి, చుట్టుపక్కల రైతుల సంతకాలు కూడా తీసుకున్నప్పటికీ ఇప్పటివరకు పట్టా మంజూరు కాలేదని తెలిపారు. తనకు పట్టా మంజూరు చేయించి న్యాయం చేయాలని కోరారు. ఈ దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యల నిమిత్తం తాసిల్దార్ కు ఎండార్స్ చేశారు. లక్ష్మీదేవిపల్లి మండలం పాత కారుకొండ గదిగుట్ట గ్రామపంచాయతీ పరిధికి చెందిన బట్టు సుభద్ర తనకు స్థానికతకు సంబంధించిన లోకల్ ఏరియా సర్టిఫికెట్‌ను సంబంధిత తహసీల్దార్ మంజూరు చేశారని తెలిపారు. ఇటీవల అంగన్‌వాడీ ఆయా పోస్టుకు దరఖాస్తు చేసుకోగా, విచారణ సమయంలో తాను స్థానికంగా ఉండడం లేదని, హైదరాబాద్‌లో నివసిస్తున్నట్లు గుర్తుతెలియని వ్యక్తులు అధికారులకు సమాచారం ఇచ్చారని తెలిపారు . ఈ విషయంపై సంబంధిత తహసీల్దార్ ద్వారా విచారణ జరిపించి తనకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరగా, కలెక్టర్ తగు చర్యలు నిమిత్తం గుండాల తాసిల్దార్ కు ఎండార్స్ చేశారు. దుమ్ముగూడెం మండలానికి చెందిన బానోత్ భవిత గత ఆరు సంవత్సరాలుగా పర్ణశాలలోని నారచీరల ప్రాంతంలో కూల్‌డ్రింక్స్, బజ్జి, పకోడీల దుకాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత నెలలో గోదావరి వరదల సమయంలో తన దుకాణం నీట మునిగిపోవడంతో దుకాణాన్ని తొలగించానని, తిరిగి అదే ప్రాంతంలో దుకాణం ఏర్పాటు చేసుకునేందుకు వెళ్లగా మరొకరు అక్కడ దుకాణం ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. ఈ విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని, తన దుకాణం ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పించి న్యాయం చెయ్యాలని చేసిన దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యలు నిమిత్తం దుమ్ముగూడెం తాసిల్దార్ కు ఎండార్స్ చేశారు. దమ్మపేట మండలం వడ్లగూడ గ్రామపంచాయతీకి చెందిన కుంజ సావిత్రి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన పట్టాదారు పాస్‌బుక్‌లలో సర్వే నంబర్ 394/10/Aలో 4.2500 ఎకరాల భూమి ఉన్నట్లు తెలిపారు. సదరు భూమికి తెలంగాణ పట్టాదారు పాస్‌బుక్ జారీ చేయడంతో పాటు భూమి హద్దులను సర్వే చేయాలని కోరుతూ చేసిన దరఖాస్తు ను పరిశీలించి తగు చర్యలు నిమిత్తం దమ్మపేట తాసిల్దార్ కు ఎండార్స్ చేశారు. లక్ష్మీదేవిపల్లి మండలం కారుకొండ పంచాయతీకి చెందిన వాంకుండోత్ సునీత మాట్లాడుతూ, తన కుమారుడు చరిత్ మానస్ తమిళనాడు రాష్ట్రంలోని అమరావతి నగర్‌లో ఉన్న ఆల్ ఇండియా సైనిక్ స్కూల్‌లో చదువుతున్నట్లు తెలిపారు. తెలంగాణలో సైనిక్ స్కూల్ అందుబాటులో లేనందున ఎన్‌టీఏ నిర్వహించిన పరీక్షలో తెలంగాణ రాష్ట్రం నుంచి ఎస్టీ కేటగిరీలో మొదటి ర్యాంక్ సాధించి తమిళనాడులోని సైనిక్ స్కూల్‌లో సీటు పొందినట్లు పేర్కొన్నారు. ప్రతి ఏడాది సుమారు రూ.2 లక్షల మేర ఫీజు చెల్లించాల్సి రావడంతో ఆర్థికంగా భారంగా మారిందని తెలిపారు. తన భర్త 2020లో ప్రమాదవశాత్తు మృతి చెందారని, తన కుమారుడి చదువుకు ప్రభుత్వం తరఫున ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# తనిఖీల పేరుతో దోపిడీ?

(మొదటి పేజీ తరువాయి...)

తీసుకున్నారు? అనే వివరాలు బహిర్గతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మరోవైపు తనిఖీల పేరుతో మెడికల్ షాప్ యజమానుల నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణల్లో వాస్తవం ఎంత? ఆధారాలు ఏమిటి? అనే అంశాలపై సంబంధిత అధికారులు సమగ్రంగా వివరణ ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది.

సర్టిఫికెట్ ఒకరిది.. షాప్ నిర్వహించేది మరొకరా?

మెడికల్ షాపుల నిర్వహణలో అర్హత కలిగిన వ్యక్తి సర్టిఫికెట్‌ను ఉపయోగించుకుని, వాస్తవంగా వ్యాపారం మాత్రం అర్హత లేని మరో వ్యక్తి నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ తరహా వ్యవహారాలు నిజమైతే నిబంధనల ప్రకారం ఎలాంటి చర్యలు తీసుకున్నారు? ఎన్ని కేసులు నమోదు చేశారు? అన్నది కీలక ప్రశ్నగా మారింది.

'మీరు దోచుకోండి.. మేం సర్దిపై చేస్తాం' అన్నట్టేనా?

తనిఖీలు కేవలం రికార్డులకే పరిమితమై, అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు లేకపోతే ప్రభుత్వ తనిఖీల ఉద్దేశమే ప్రశ్నార్థకంగా మారుతుంది.

"మీరు దోచుకోండి..మేం సర్దిపై చేస్తాం" అన్నట్టుగా వ్యవస్థ మారకూడదని ప్రజలు అంటున్నారు.

తనిఖీలు నిజంగా నిబంధనల అమలు కోసం జరుగుతున్నాయా? లేక తనిఖీల పేరుతో మామూళ్ల వ్యవహారాలకు అవకాశం కల్పిస్తున్నారా? అన్న అనుమానాలకు అధికారులు తెరదించాల్సిన అవసరం ఉంది.

రాందాస్ వివరణ ఏమిటి?

తనిఖీలు నిర్వహిస్తున్న రాందాస్ అర్హతలు, హోదా, అధికార పరిధి ఏమిటి?

తనిఖీలు నిర్వహిస్తున్నామని చెబుతున్న అధికారులు ఆమెకి ఏ విధమైన సర్టిఫికెట్స్ ఉన్నాయో దాని గురించి తెలపలేదు

తనిఖీలు నిర్వహించిన తేదీలు ఏమిటి?
ఎన్ని మెడికల్ షాపులను తనిఖీ చేశారు?
ఎలాంటి ఉల్లంఘనలు గుర్తించారు?
ఎన్ని కేసులు నమోదు చేశారు?
సర్టిఫికెట్ ఒకరి పేరుపై ఉండి.. షాప్‌ను మరొకరు నిర్వహిస్తున్న ఘటనలపై ఏ చర్యలు తీసుకున్నారు?
తనిఖీల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై ఆయన సమాధానం ఏమిటి?
ఈ ప్రశ్నలకు రాందాస్ ఎలాంటి వివరణ ఇస్తారో వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.
తనిఖీలు కఠినంగా జరిగితేనే అక్రమాలకు అడ్డుకట్ట పడుతుంది. లేకపోతే నామమాత్రపు తనిఖీలు..కొనసాగుతున్న అక్రమాలకు పరోక్ష రక్షణగా మారే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# రామప్ప రక్షణకు కట్టుబడి ఉన్నాం

- శాస్త్రీయ అధ్యయనం తర్వాతే వెంకటాపూర్ మైనింగ్‌పై నిర్ణయం
- రామప్పకు నష్టం కలిగించే ప్రసక్తే లేదు.. సింగరేణి యాజమాన్యం స్పష్టీకరణ

**భద్రాద్రి కొత్తగూడెం / సింగరేణి ప్రతినిధి, అక్టోబర్ 5, ప్రజా జ్యోతి:** ప్రపంచ వారసత్వ సంపద రామప్ప దేవాలయానికి సింగరేణి మైనింగ్‌తో ముప్పు ఉందంటూ వస్తున్న వార్తలు కేవలం అపోహలు, అవాస్తవాలేనని సింగరేణి యాజమాన్యం స్పష్టం చేసింది. రామప్ప పరిరక్షణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని పేర్కొంది. ములుగు జిల్లా వెంకటాపూర్‌లో ప్రతిపాదించిన ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుపై అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే ముందుకు వెళ్లాలని నిర్ణయించినట్లు సింగరేణి తెలిపింది. మైనింగ్ కార్యకలాపాల వల్ల రామప్ప దేవాలయంపై ఏమైనా ప్రభావం ఉంటుందా? అనే అంశాన్ని శాస్త్రీయంగా అధ్యయనం చేయనున్నట్లు పేర్కొంది.

### »» నిపుణుల నివేదికల ఆధారంగానే నిర్ణయం

భారత పురావస్తు శాఖతో పాటు ఇతర ప్రతిష్టాత్మక సంస్థలు, నిపుణుల ద్వారా శాస్త్రీయ అధ్యయనాలు నిర్వహించి, వాటి నివేదికలను పరిశీలించిన తర్వాతే తదుపరి చర్యలు చేపడతామని సింగరేణి స్పష్టం చేసింది. నిపుణుల సూచనలు, శాస్త్రీయ నివేదికలను పరిగణనలోకి తీసుకోకుండా ఎలాంటి నిర్ణయం తీసుకోబోమని తెలిపింది.

### »» వారసత్వ సంపదకు ప్రాధాన్యం

తెలంగాణకు చెందిన ప్రపంచ వారసత్వ సంపద రామప్ప దేవాలయాన్ని కాపాడటం తమ బాధ్యతగా భావిస్తున్నామని సింగరేణి పేర్కొంది. రామప్ప దేవాలయానికి ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టం కలిగించే చర్యలకు పాల్పడబోమని స్పష్టం చేసింది. మైనింగ్ కార్యకలాపాల విషయంలో పర్యావరణ పరిరక్షణతో పాటు చట్టపరమైన నిబంధనలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని తెలిపింది. పర్యావరణహితమైన, చట్టబద్ధమైన మైనింగ్ కార్యకలాపాలకే ప్రాధాన్యం ఉంటుందని పునరుద్ఘాటించింది.

### »» అపోహలకు తావులేదు

రామప్పకు మైనింగ్‌తో ముప్పు ఉందంటూ వస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని సింగరేణి పేర్కొంది. ప్రాజెక్టుకు సంబంధించి శాస్త్రీయ అధ్యయనాలు పూర్తయి, సంబంధిత సంస్థల నుంచి నివేదికలు వచ్చిన తర్వాతే వాస్తవ పరిస్థితి స్పష్టమవుతుందని తెలిపింది. ప్రపంచ వారసత్వ సంపద రామప్ప పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని, బాధ్యతాయుతమైన ప్రభుత్వ రంగ సంస్థగా అన్ని నిబంధనలను పాటిస్తూ మాత్రమే ముందుకు సాగుతామని సింగరేణి యాజమాన్యం ఓ ప్రకటనలో తెలిపారు.

## ప్రభుత్వ ఆసుపత్రి బాట పట్టిన తెలంగాణ రక్షణ సేన

- కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో వసతులపై ఆరా



**కొత్తగూడెం, అక్టోబర్ 5, ప్రజా జ్యోతి :** తెలంగాణ రక్షణ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు సముద్రాల క్రాంతి కుమార్ సోమవారం కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. రోగులను కలిసి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, మందులు, తాగునీరు, మరుగుదొడ్లు, పడకలు, పారిశుద్ధ్యంపై వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేదలకు మెరుగైన వైద్యం, వసతులు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. రోగులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి. వీరన్న, దోనెపెల్లి కమల గాయత్రి, లకావత్ సురేష్, కొత్తగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జి నమ్మి జగదీష్ పాల్గొన్నారు.

## రోడ్డు పనులు పూర్తయ్యే వరకు పోరాటం

- శేషగిరినగర్ కాలనీవాసులతో కలిసి నిరసన
- తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు సముద్రాల క్రాంతి



**కొత్తగూడెం, అక్టోబర్ 5, ప్రజా జ్యోతి :** కొత్తగూడెం పోస్ట్‌ఆఫీస్ సెంటర్ నుంచి హేమచంద్రపురం వెళ్లే రహదారి అధ్వానంగా మారడంతో ప్రజలు దుమ్ము, ధూళి కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు సముద్రాల క్రాంతి అన్నారు. సోమవారం శేషగిరినగర్ కాలనీ వాసులతో కలిసి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. గత కొన్నేళ్లుగా రహదారి శిథిలావస్థలో ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దుమ్ము ధూళి కారణంగా చిన్నారులు, వృద్ధులు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని క్రాంతి స్పష్టం చేశారు. నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలని అధికారులను కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో టీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి. వీరన్న, మహిళా విభాగం దోనెపెల్లి కమల గాయత్రి, లకావత్ సురేష్, కొత్తగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జి నమ్మి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోండి

- కోనేరు చిన్ని



**కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 5, (ప్రజా జ్యోతి)** ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకు నేందుకు అర్హులైన గ్రాడ్యుయేటర్లు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కోనేరు సత్యనారాయణ (చిన్ని) కోరారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫాం –18 ద్వారా 2023 నవంబర్ నాటికి డిగ్రీ,లేదా దానికి సమానమైన డిప్లొమా పూర్తి చేసిన వారు ఓటరుగా నమోదు చేసుకో వాలని కోరారు.వచ్చే నెల 6 తేదీ లోగా దరఖాస్తు చేసు కోవాలని కోరారు.ఓటర్ ఐడి కార్డు,ఆధార్ కార్డు,డిగ్రీ / గ్రాడ్యుయేషన్ సర్టిఫికేట్,పాస్పోర్ట్ సైజ్ ఫోటో,మొబైల్ నంబర్ తో అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో నాణ్యత లేని కోడి గుడ్లు పంపిణీ

- నెలనెలా సక్రమంగా పంపిణీ చేయడం లేదంటూ స్థానికుల ఆరోపణలు



**అశ్వారావుపేట అక్టోబర్ 5 ప్రజా జ్యోతి:** మండల కేంద్రంలోని దొంతికుంట అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పంపిణీ చేస్తున్న కోడిగుడ్ల నాణ్యతపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుళ్లిపోయిన కోడిగుడ్లను పంపిణీ చేస్తున్నారంటూ దొంతికుంట గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు.ప్రతి నెలా చిన్నారులకు అందాల్సిన కోడిగుడ్లను సక్రమంగా పంపిణీ చేయకుండా ఒక నెల ఆలస్యంగా ఇస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అదేవిధంగా చిన్నారులకు అందించాల్సిన పోషకాహారాన్ని కూడా నిబంధనల ప్రకారం క్రమం తప్పకుండా పంపిణీ చేయడం లేదని స్థానికులు చెబుతున్నారు.చిన్నారుల ఆరోగ్యానికి సంబంధించిన పోషకాహార విషయంలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొంటున్నారు. కుళ్లిపోయిన లేదా నాణ్యత లేని కోడిగుడ్లు పంపిణీ చేయడం వాటిని ఎలా తినాలని అంటున్నారు ? అయితే వాటిని పంపిణీ చేసే ముందు నాణ్యతను పరిశీలిస్తున్నారా? ప్రతి నెలా సరఫరా, పంపిణీ వివరాలను అధికారులు పర్యవేక్షిస్తున్నారా? అనే ప్రశ్నలు స్థానికుల నుంచి వ్యక్తమవుతున్నాయి.ఈ విషయంపై సీడీపీవో / సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి, కోడిగుడ్ల నాణ్యతను పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. నాణ్యమైన పోషకాహారం సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

### »» సిడిపిఓ ముత్తమ్మ వివరణ

మాకు ఎప్పటికప్పుడు కొత్త బ్యాచ్ కోడిగుడ్లు వస్తున్నాయని అలాంటి జరగకుండా చూసుకుంటానని అంటూనే కాంట్రాక్టర్లు మాకు బాగానే సహకరిస్తున్నారు కాంట్రాక్టర్ మంచివాడే అని సిడిపిఓ సర్టిఫికెట్ ఇచ్చేస్తున్నారు మరి ఇలాంటి కుళ్ళిపోయిన కోడిగుడ్లు ఎలా వస్తాయని ప్రజలు విమర్శిస్తున్నారు.





## రహదారులను గాలికొదిలేసిన ప్రజాప్రతినిధులు!

- మంత్రులు వస్తేనే మరమ్మతులా?..
- ప్రమాదాల భయంతో ప్రయాణికులు



**అశ్వాపురం, అక్టోబర్5, ప్రజాజ్యోతి** అశ్వాపురం మండలంలో రహదారుల పరిస్థితి రోజురోజుకూ అధ్వానంగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంతలు, దెబ్బతిన్న రోడ్లు, సరైన నిర్వహణ లేకపోవడంతో నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు.



రహదారులపై ప్రయాణిస్తుంటే సురక్షితంగా ఇంటికి చేరుతామా లేదా అన్న ఆం దోళన నెలకొంటోందని పలువురు పేర్కొంటున్నారు.ప్రధాన రహదారులతో పా టు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే మార్గాల్లోనూ పలుచోట్ల రోడ్లు దెబ్బతిన్నాయని స నికుల వాదన. వర్షాలు కురిసిన సమయంలో గుంతల్లో నీరు చేరడంతో అవి కనిపించకపోవడం వల్ల ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడే పరిస్థితులు ఏర్పడుతున్నాయని అంటున్నారు. రాత్రివేళ పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోందని ప్రయాణికులు చెబుతున్నారు.రహదారుల సమస్యలపై పలుమార్లు పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొన్నిచోట్ల తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా కొద్దికాలానికే రహదారు లు మళ్లీ దెబ్బతింటున్నాయని పేర్కొంటున్నారు.ప్రజల అవసరాల కోసం రహదారులు.. కార్యక్రమాల కోసం మరమ్మతులా? అనే ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు రహదారుల పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రమాదకరంగా మారిన ప్రాంతాలను గుర్తించి శాశ్వత మరమ్మతు లు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి కొనసాగుతుండటంతో ఇకనైనా రహదారుల సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని స్థానికులు చెబుతున్నారు. ప్రజల ఓట్లతో ఎన్నికైన ప్రజాప్రతినిధులు ప్రజల రాకపోకలకు సంబంధించిన మౌలిక వసతులపై కూడా సమానంగా దృష్టి పెట్టాలని వారు కోరుతున్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, రహదారుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి

- మణుగూరులో అఖిలపక్ష పార్టీల ర్యాలీ, ధర్నా
- ఓటు హక్కును కాలరాస్తున్న సీఈసీకి వ్యతిరేకం గా అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం
- బీఆర్ఎస్ మినహా అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన
- రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు డిమాండ్
- కేంద్ర ఎన్నికల అధికారి తీరుపై మణుగూరులో పార్టీల ఆగ్రహం
- ప్రజాస్వామ్యాన్ని కాపాడండి..! సీఈసీని తొలగించండి అంటూ అఖిలపక్ష నినాదాలు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి, మణుగూరు. అక్టోబర్ 5, (ప్రజాజ్యోతి)** రాజ్యాంగ హక్కులను హరిస్తూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో పవిత్రమైన ఓటు హక్కును కాలరాస్తున్నారంటూ కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ తీరుపై సోమవారం అఖిలపక్ష పార్టీలు మండిపడ్డాయి. ఆయన తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మణుగూరులో బీఆర్ఎస్ మినహా అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించిన నాయకులు, అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుని వినతి పత్రాన్ని అందజేసి నిరసన తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం ఏకపక్షంగా వ్యవహరిస్తోందని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే జ్ఞానేష్ కుమార్ ను పదవి నుంచి తొలగించాలని నినాదాలతో డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని, ఓటు హక్కును కాపాడేందుకు తమ పోరాటం కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు. అఖిలపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- డివిజన్ అధికారులను ఆదేశించిన సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట



**భద్రాచలం, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి):** ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట డివిజన్ అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా ప్రజావాణిలో దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిష్కరించడంతోపాటు అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించే అవకాశం ఉంటుందని తెలిపారు.సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. రెవెన్యూ, భూ సమస్యలు, పింఛన్లు, సంక్షేమ పథకాలు, నిరుద్యోగుల సమస్యలు, వ్యక్తిగత సమస్యలకు సంబంధించిన అర్జీలను సంబంధిత అధికారులకు పంపించారు.ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును పరిశీలించి ఆన్ లైన్లో నమోదు చేసి సంబంధిత శాఖలకు పంపించారు, శాఖాధిపతులు వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులో సమస్యలను పరిష్కరించాలని సబ్ కలెక్టర్ సూచించారు. ఎలాంటి దరఖాస్తులు పెండింగ్లో లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.కార్యక్రమంలో డీఎల్పీవో సుధీర్, డీపీవో భగవాన్ రెడ్డితో పాటు భద్రాచలం డివిజన్ పరిధిలోని వివిధ శాఖల డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్రూం "డ్రా "లో నిరుపేదల ఎంపికలో అన్యాయం తగదు

- అర్హులైన నిరుపేదలకు మొండి చేయి
- ఇళ్లు ఉన్నవారికి కేటాయింపులా?
- లక్కీ డ్రా నిర్వహణ ఎంపికపై సమగ్ర విచారణ చేయాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు




**కొత్తగూడెం కలెక్టరేట్ ,అక్టోబర్05, (ప్రజా జ్యోతి)** పాల్వంచలో డబుల్ బెడ్రూం ఇళ్లకు అర్హులైన నిరుపేదల ఎంపికలో తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు ఆరోపించారు. అద్దె ఇళ్లలో ఉంటున్న నిరుపేదలకు ఇళ్లు కేటాయించకుండా, సొంత ఇళ్లు ఉన్నవారికి ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించలేదని, తక్షణమే జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సోమవారం ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ .అనేక సంవత్సరాలుగా నిరుపేదలకు ఇంటి స్థలాలు, ఇళ్లు కేటాయించాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పాల్వంచలో పోరాటాలు చేస్తున్నామని తెలిపారు. 2018లో అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం స్పందించి ఇంటి స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. అయితే ప్రభుత్వ స్థలాలపై అధికారులకు స్పష్టత లేని సమయంలోనే 2015 నుంచి సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ప్రభుత్వ స్థలాలను పరిశీలించి, ప్రస్తుతం డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించిన ప్రాంతంలో పేదలు గుడిసెలు వేసుకున్నారని చెప్పారు. అప్పట్లో ఆర్డీవో, తహసీల్దార్ అక్కడికి వచ్చి తమతో చర్చించి, అదే ప్రాంతంలో డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి పేదలకు అందజేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. దరఖాస్తులు అందజేయాలని అధికారులు సూచించడంతో పోరాటాన్ని విరమించామని అన్నారు, అనంతరం టీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి పూర్తిస్థాయిలో నిధులు కేటాయించకుండా సంవత్సరాల తరబడి జాప్యం చేసిందని, అనేకసార్లు అధికారులను కలిసి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి పేదలకు కేటాయించాలని విజ్ఞప్తి చేసినా స్పందన లేదన్నారు. తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకున్నప్పటికీ, అప్పటికే నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్లను పూర్తి చేసి అర్హులకు కేటాయించాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టామని తెలిపారు. ఆ సమయంలో అధికారులు మరోసారి అక్కడికి వచ్చి నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లు అందజేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించామని చెప్పారు. అయితే ఇచ్చిన హామీని అధికారులు నిలబెట్టుకోలేదని విమర్శించారు. ఎవరి వెనుక ఏ రాజకీయ వర్గాల అండ ఉందో ప్రజలందరికీ తెలుసని, ఎవరు ప్రభావితం చేస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారని మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను విచారణ చేసి 360 మంది లబ్ధిదారులకు ఇళ్లు కేటాయిస్తున్నామని చెప్పడం సరికాదన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం అక్కడ తీసుకున్న దరఖాస్తులు ఏమయ్యాయని ప్రశ్నించారు.

### >> లక్కీ డ్రాపై అభ్యంతరం

అనేక దఫాలుగా అధికారులకు దరఖాస్తులు అందజేసినప్పటికీ, హడావుడిగా పాల్వంచకు దూరంగా లబ్ధిదారుల ఎంపికకు లక్కీ డ్రా నిర్వహించాల్సిన అవసరం ఏముందని మచ్చ వెంకటేశ్వర్లు ప్రశ్నించారు. దీంతో అసలైన లబ్ధిదారులు సీపీఐ(ఎం) కార్యాలయానికి వచ్చి తమ గోడును వెళ్లబోసుకున్నారని తెలిపారు. అధికారులు గతంలో హామీ ఇచ్చిన ప్రాంతంలోనే లబ్ధిదారుల ఎంపిక జాబితాను ప్రకటించాలని డిమాండ్ చేశారు. లబ్ధిదారుల జాబితాను ఎలా ఖరారు చేశారు? ఎక్కడ గ్రామసభలు నిర్వహించారు? ఎక్కడ విచారణ చేపట్టారు? అనే విషయాలపై అధికారులు సమాధానం చెప్పాలని కోరారు. డివిజన్లో ఎంతమంది అర్హులకు, ఎంతమంది అనర్హులకు ఇళ్లు కేటాయించారనే వివరాలను వెల్లడిస్తామని అన్నారు. అసలైన లబ్ధిదారులు ఇక్కడే ఉన్నప్పుడు ఎవరికి ఇళ్లు కేటాయించారో అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

### >> అనర్హులకు కేటాయించారని ఆరోపణ

లబ్ధిదారుల ఎంపికలో తమ వద్ద ఉన్న ప్రాథమిక సమాచారం ప్రకారం పాల్వంచలోని వెంగళరావు కాలనీలో 11 మందికి ఇళ్లు కేటాయిస్తే వారిలో తొమ్మిది మంది అనర్హులుగా ఉన్నారని మచ్చ వెంకటేశ్వర్లు ఆరోపించారు. మరోచోట 13 మందిని ఎంపిక చేస్తే అందులో నలుగురు అనర్హులు ఉన్నారని, బాబూజీనగర్లో 15 మందికి ఇళ్లు కేటాయిస్తే ఆరుగురు అనర్హులు ఉన్నారని తెలిపారు. ఈ వివరాలను ఆధారాలతో నిరూపించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. అన్ని ప్రాంతాల్లోనూ ఇష్టానుసారంగా లబ్ధిదారులను ఎంపిక చేశారని ఆయన ఆరోపించారు. సొంత ఇళ్లు ఉన్నవారికి, రాజకీయ వర్గాలకు, డబ్బులు ఇచ్చిన వారికి ఇళ్లు కేటాయించారన్న ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై తక్షణమే జిల్లా కలెక్టర్ విచారణ చేపట్టాలని, ఎమ్మెల్యే కూడా పరిశీలించాలని డిమాండ్ చేశారు. నిజమైన లబ్ధిదారులు ఎక్కడ ఉన్నారో వారి వద్దకు వెళ్లి విచారణ నిర్వహిస్తే వాస్తవాలు బయటపడతాయని అన్నారు.

### >> నాసిరకం నిర్మాణాలపై ప్రశ్నలు

డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాకముందే లబ్ధిదారుల జాబితాను ప్రకటించడం ఏమిటని మచ్చ వెంకటేశ్వర్లు ప్రశ్నించారు. .ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ లబ్ధిదారుల ఎంపికపై సమగ్ర విచారణ జరిపి నిజమైన నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని మచ్చ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు.అధికారులు గతంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కోరారు. లేనిపక్షంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరుపేదలతో కలిసి భారీ ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా నాయకులు దొడ్డ రవికుమార్, పట్టణ కార్యదర్శి తులసీరామ్ కార్యదర్శి వర్గ సభ్యులు సత్యవాణి ఎస్కె నిరంజన్ కమిటీ సభ్యులు సులోచన వింజరాములు బీ,కాంతి తదితరులు పాల్గొన్నారు.

## అమ్మంటే నడిచే దైవం దుర్గమ్మతల్లి

- డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ కొత్వాల

**కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 5, (ప్రజా జ్యోతి)** అమ్మఅంటే నడిచే దైవం దుర్గమ్మతల్లి అని డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్, రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ కోఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. శ్రీదేవి నవరాత్రి మహోత్సవాల సందర్భంగా సోమవారం పాల్వంచలోని పలు ప్రాంతాలలో జరిగిన పూజలలో కొత్వాల, పాతపాల్వంచ 46 వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవిలు పాల్గొని పూజలు నిర్వహించారు, పాల్వంచ పట్టణంలోని బొల్లోరిగూడెంలోని భద్రకాళి యూత్, వెంగళరావు కాలనీలో పాతపాల్వంచ, చాకలి బజార్ యూత్ ఆధ్వర్యం లో, హైస్కూల్ రోడ్ లో జరిగిన కర పూజ కార్యక్రమంలో కొత్వాలతో పాటు విమలాదేవిలు పాల్గొని, పూజలు చేశారు. కొత్వాల మాట్లాడుతూ అమ్మవారిని నియమనిష్ఠలతో పూజించాలని, ఆమె కృపాకటాక్షాలు పొందాలని కొత్వాల అన్నారు,ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిరిపురపు లలితకుమారి, కార్పొరేటర్లు కొత్వాల విమలాదేవి, డాక్టర్ బిఎస్ రావు, సీరపు సుగుణారెడ్డి, నూకల సరిత, మాలంపాటి భవిత, హోళి శ్రీనివాసరావు, దాంతేబోయిన నరేష్, నాయకులు చింతా నాగరాజు, బాడిశ శంకర్ రావు, కట్టు శ్రీలత, చల్లగుండ్ల సుజాత, వాలంపల్లి రాంబాబు, సందు ప్రభాకర్, పెండ్యాల శేషు, బూసి శ్రీను, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## పిఆర్ టియు -టిఎస్ జిల్లా కమిటీ ఎన్నిక

- అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పూనెం నర్సయ్య, భూక్య భాస్కర్ లు నియామకం

**కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 5, (ప్రజా జ్యోతి)** పి ఆర్ టి యు –టి ఎస్ కొత్తగూడెం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పూనెం నర్సయ్య, భూక్య భాస్కర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాల్వంచ మండలం జగన్నాధపురంలోని పెద్దమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలోని అమ్మ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన జిల్లా సర్వసభ్య సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి బిక్షంగౌడ్, రాష్ట్ర ఆడిట్ కమిటీ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జిల్లాలోని 23 మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొనగా అందరి సమక్షంలో పూనెం నర్సయ్యను జిల్లా అధ్యక్షుడిగా, భూక్య భాస్కర్ను జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికల అధికారిగా వ్యవహరించిన మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు సతీష్ రెడ్డి నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ జిల్లాలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, వారికి మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు.



# సింగరేణి కంపెనీ వాస్తవ లాభాలు ప్రకటించాలి

- **కార్మికులకు 40 శాతం ఇవ్వాలి**
- **జెన్కో నుంచి రావలసిన రూ. 59 వేల కోట్ల రూపాయలు ఇవ్వాలని మైన్స్ పై ఏఐటియుసి ధర్నాలు**





**ఇల్లందు, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి)** సింగరేణి కంపెనీ 2025–26 వార్షిక సంవత్సరానికి వాస్తవ లాభాలు ప్రకటించాలని, కార్మికులకు 40 శాతం ఇవ్వాలని ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి ఎండి నజీర్ అహ్మద్ డిమాండ్ చేశారు. సోమవారం జెన్కో నుంచి సింగరేణికి రావలసిన రూ. 59 వేల కోట్ల రూపాయలు ఇవ్వాలని మైన్స్ పై ఏఐటియుసి ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించి వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌లో పనిచేస్తున్న కార్మికులకు ప్రతి సంవత్సరం దసరా పండుగ సందర్భంగా సంస్థ లాభాల్లో వాటా ప్రకటించి చెల్లించడం ఒక సంప్రదాయంగా కొనసాగుతోంది. అయితే 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక లాభాలను ఇప్పటివరకు ప్రకటించకపోవడం పట్ల కార్మికవర్గంలో తీవ్ర ఆందోళన నెలకొందన్నారు. సింగరేణి సంస్థ అభివృద్ధిలో బొగ్గు ఉత్పత్తి సాధనలో సంస్థకు లాభాలు ఆర్జించి పెట్టడంలో కార్మికుల శ్రమ, అంకితభావం ఎంతో కీలకమైనవని కార్మికుల కృషి ఫలితంగా సంస్థకు లాభాలు వచ్చినప్పుడు ఆ లాభాల్లో కార్మికులకు తగిన వాటా కల్పించడం యాజమాన్యం బాధ్యతగా గుర్తించాలని పేర్కొన్నారు. గత సంప్రదాయాన్ని కొనసాగిస్తూ గుర్తింపు పొందిన కార్మిక సంఘంతో చర్చించి ముఖ్యమంత్రి సమక్షంలో కార్మికులకు 40 శాతం లాభాల వాటాను ప్రకటించి చెల్లించాలని డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థలో ఎన్నడూ లేనివిధంగా ఉత్పత్తి, కార్మికుల రక్షణకు అవసరమైన మెటీరియల్, పరికరాల కొరత ఏర్పడుతున్నట్లు కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అవసరమైన మెటీరియల్ కొనుగోలుకు నిధులు లేవని యాజమాన్యం పేర్కొంటున్న పరిస్థితి ఆందోళనకరంగా ఉందని పేర్కొన్నారు. బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించడంతో పాటు, కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించడానికి అవసరమైన పరికరాలు, మెటీరియల్‌ను సమకూర్చడం అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాల్సిన బాధ్యత ఉందని, ఇదే పరిస్థితి కొనసాగితే, అక్టోబర్, నవంబర్ నెలల్లో కార్మికులకు చెల్లించాల్సిన పండుగ అడ్వాన్స్, లాభాల వాటా, దీపావళి బోనస్, పి.ఎల్.ఆర్.ఎస్. (పిఎల్ఆర్) వంటి ఆర్థిక ప్రయోజనాల చెల్లింపులపై ప్రభావం పడే ప్రమాదం ఉందని, దీనివల్ల కార్మికులు, వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందన్నారు. సంస్థ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సింగరేణి సంస్థకు తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థ (టీ జీ జెన్కో), తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ప్రసార సంస్థ నుండి సుమారు రూ.59 వేల కోట్ల బకాయిలు రావాల్సి ఉందని, ఈ భారీ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఇప్పించేలా చర్యలు తీసుకుంటే, సంస్థ ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను అధిగమించడానికి ఉత్పత్తి, రక్షణకు అవసరమైన మెటీరియల్‌ను సమకూర్చడానికి, కార్మికులకు చెల్లించాల్సిన ఆర్థిక ప్రయోజనాలను సకాలంలో అందించడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. వెంటనే కార్మికుల ప్రయోజనాలను సంస్థ ఆర్థిక స్థితిగతులను దృష్టిలో ఉంచుకొని డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా సమితి సభ్యుడు గుగులోత్ కృష్ణ, ఫిట్ కార్యదర్శులు మాలోత్ హరిసింగ్, దాట్ల వెంకటేశ్వర్లు, కలవల సిద్దార్థ్, జక్కుల శ్రీనివాస్, నూనావత్ లచ్చిరామ్, చాంద్ పాష, చెరుకు సారయ్య, చిక్కా శ్రీనివాస్, పి యుగేందర్, విజయ్ శ్రీనివాస్, గుగ్గిల్ల శ్రీనివాస్, మంగపతి రావు, కొంటు వీరస్వామి, మేగరాజు, మఖ్బుల్ షరీఫ్, రావూజీ, గుగులోత్ వీరన్న, రవి, భట్టు రవి, వెంకటరెడ్డి, జర్పుల నరేష్, సంతోష్ కుమార్, సింధు ప్రియ, రహమత్, రజనీ, స్వరూప, అపర్ణ, మౌనీక, సుమలత, భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బి.సి గురుకులాల సిబ్బందికి వేతనాలు చెల్లించాలి

- **జీతాలు చెల్లించని కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలి సిఐటియు**



**కొత్తగూడెం కలెక్టరేట్ ,అక్టోబర్ 5, (ప్రజా జ్యోతి )** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 28 బిసి గురుకుల విద్యాసంస్థల్లో పనిచేస్తున్న వంట సిబ్బంది ,వాచ్మెన్లు శానిటేషన్ సిబ్బంది యొక్క మూడు నెలల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. 2026 మార్చి ఏప్రిల్ నెలల వేతనాలు కార్మికులకు చెల్లించకుండా తన సొంతానికి వినియోగించుకున్న సంబంధిత కాంట్రాక్టర్ పైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ కు సోమవారం వినతి పత్రం అందజేశారు, సిఐటియు జిల్లా అధ్యక్షులు కే బ్రహ్మచారి మాట్లాడుతూ కార్మికుల తో పనులు చేయించుకుని వేతనాల డబ్బులను కాంట్రాక్టర్ వాడుకోవడం చట్ట వ్యతిరేకమని ఈ విషయంపై కాంట్రాక్టర్ పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు ఒక వర్కర్ కి సంవత్సర కాలంగా వేతనం చెల్లించకుండా జీతం డబ్బులను కాంట్రాక్టర్ వాడుకొని అడిగితే నీ డబ్బులు నేను వాడుకున్న నా దగ్గర ఉన్నప్పుడు ఇస్తానంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఈ విషయంపై అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పరిష్కారం కావడం కావడం లేదన్నారు ,కార్మికుల వేతనాలను సొంతానికి వాడుకొని కార్మికులను పస్తులు ఉంచుతుంటే సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు, ఇప్పటికైనా సంబంధిత కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు బ్రహ్మచారి డిమాండ్ చేశారు ఈ విషయంపై స్పందించిన జాయింట్ కలెక్టర్ బిసి గురుకుల విద్యాసంస్థల జిల్లా సమన్వయ అధికారిని పిలిచి సమస్యను తక్షణ పరిష్కరించాలని ఆదేశించారు కాంట్రాక్టర్ల డిపాజిట్ లో డబ్బులు ప్రిన్సిపల్స్ ఆధీనంలో ఉన్నాయని ,వాటిలో నుంచి వేతనాలు చెల్లించే విధంగా తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు సమస్యల పరిష్కారం చేయకపోతే పూర్తిగా వంటలు బంద్ చేస్తామని సిఐటియు నేతలు పేర్కొన్నారు కాంట్రాక్టర్ నుండి కాకుండా బీసీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ నుండి నేరుగా కార్మికుల వేతనాలు చెల్లించాలని ప్రతి నెల మొదటి వారంలో వేతనాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డా రవికుమార్, సహాయ కార్యదర్శి కే సత్య ,కార్మికులు సుశీల సురేష్ ఉషారాణి సుమ పి కుసుమ తదితరులు పాల్గొన్నారు.

## మూడు నెలలుగా జీతాలు లేక శానిటేషన్ కార్మికుల నిరసన

- **పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్**

**భద్రాచలం, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి):** భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు గత మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో కార్మికులు సోమవారం నిరసన చేపట్టారు. పెండింగ్ లో ఉన్న మూడు నెలల వేతనాలను వెంటనే చెల్లించి తమ కుటుంబాలను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సీఐటీయూ కార్యదర్శి ఏజే రమేష్, సీఐటీయూ పట్టణ కన్వీనర్ బండారు శరత్ బాబు మాట్లాడుతూ.. ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణలో కీలకంగా పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు నెలల తరబడి జీతాలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. కార్మికుల సమస్యను ప్రభుత్వం, ఆసుపత్రి అధికారులు తక్షణమే పరిష్కరించాలని కోరారు.అనంతరం పెండింగ్ వేతనాల విషయాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సూపరింటెండెంట్ బుధవారం నాటికి ఒక నెల జీతం, వారం రోజుల్లో మరో నెల జీతం చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మిగిలిన పెండింగ్ వేతనం కూడా త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ యూనియన్ నాయకులు యు. రమణ, నరేందర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## పట్టణ సుందరీకరణకు మొక్కలు నాటిన ఎమ్మెల్యే జారే

- **పట్టణంలో పచ్చదనం పెంపొందించేందుకు చర్యలు**



**అశ్వారావుపేట, అక్టోబర్ 5 ప్రజా జ్యోతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో పట్టణ సుందరీకరణ, పచ్చదనం పెంపొందించే దిశగా చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా అశ్వారావుపేట పట్టణంలోని సెంట్రల్ లైటింగ్ డివైడర్లలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. అశ్వారావుపేట శాసనసభ్యులు గౌరవ శ్రీ జారె ఆదినారాయణ స్వయంగా మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు పాల్గొని మొక్కలు నాటారు.పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట ఉన్న సెంట్రల్ డివైడర్లలో పచ్చదనం పెంచడం ద్వారా అశ్వారావుపేట పట్టణానికి మరింత ఆకర్షణీయమైన రూపాన్ని తీసుకురావడం తో పాటు, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే సెంట్రల్ లైటింగ్‌తో అభివృద్ధి చేసిన డివైడర్లలో మొక్కలు పెంచడం ద్వారా రహదారి పరిసరాలను పచ్చదనంతో తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నారు. పలువురు కాంగ్రెస్ నాయకులు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## పెద్దవాగు దారిని అభివృద్ధి చేస్తున్నాం

- **ఎంపీఓ ఆదేశాల మేరకు రహదారి శుభ్రత పనులు**



**పినపాక, అక్టోబర్ 05(ప్రజాజ్యోతి )**పినపాక మండల పరిధిలోని పోట్లపల్లి గ్రామం నుంచి పెదవాగుకు వెళ్లే రహదారిని ప్రజలకు, రైతులకు సౌకర్యవంతంగా ఉండేలా అభివృద్ధి చేస్తున్నామని పోట్లపల్లి సర్పంచ్ మద్దెల సమ్మయ్య తెలిపారు.రహదారికి ఇరువైపులా చెట్లు, పొదలు, పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ఎంపీఓ వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు మార్గాన్ని శుభ్రం చేసే పనులు చేపట్టినట్లు తెలిపారు. రహదారికి ఇరువైపులా పెరిగిన చెట్లు, పొదలను తొలగించి మార్గాన్ని అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు.పెదవాగుకు వెళ్లే గ్రామస్తులు, రైతులు, వాహనదారులకు రాకపోకలు సులభతరం చేయడమే లక్ష్యంగా పనులు చేపట్టినట్లు సర్పంచ్ పేర్కొన్నారు. గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు తన వంతు కృషి చేస్తున్నానన్నారు.పంచాయతీ కార్యదర్శి సందీప్, ఉపసర్పంచ్ రవీందర్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు

## చలో సంగారెడ్డి పోస్టర్ ఆవిష్కరణ



**చర్ల, అక్టోబర్ 05(ప్రజాజ్యోతి):** దళిత జర్నలిస్ట్ ఫోరం 11వ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకుని 'చలో సంగారెడ్డి' పోస్టర్‌ను సోమవారం చర్ల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. టీపీసీసీ జనరల్ సెక్రటరీ నల్లపు దుర్గాప్రసాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు చీమలమర్రి మురళీకృష్ణ చేతుల మీదుగా పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా నల్లపు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ దళిత జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. దళిత జర్నలిస్టులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో మరింత మెరుగైన పాలన అందిస్తామని సంగారెడ్డిలో నిర్వహించనున్న దళిత జర్నలిస్ట్ ఫోరం 11వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.చీమలమర్రి మురళీకృష్ణ మాట్లాడుతూ దళిత జర్నలిస్టుల ఐక్యతే బలమని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల సాధన కోసం అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని కోరారు.ఈ కార్యక్రమంలో చర్ల సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, కాంగ్రెస్ నాయకుడు పూజారి శ్రీకాంత్, చర్ల ఉపసర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కాపుల కృష్ణార్జున్‌రావు, లింగాపురం సర్పంచ్ గుగులోత్ మంగ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ముమ్మినేని అరవింద్, చర్ల 14వ వార్డు సభ్యుడు గుండెపుడి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ సంబంధం మహిళ కోసం కట్టుకున్న భార్యకే వేధింపులా!

- ముగ్గురు పిల్లలతో అత్తింటి ఎదుట పురుగుల మందు డబ్బాతో బైఠాయింపు.. న్యాయం చేయాలని వేడుకోలు





**అశ్వాపురం అక్టోబర్ 5,ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల పరిధిలోని జగ్గారం గ్రామానికి చెందిన తండాలో కుటుంబ కలహాలు, అదనపు కట్నం వేధింపుల ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. తన భర్త అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని, మరో మహిళతో సంబంధం పెట్టుకున్నాడని ఆరోపిస్తూ ఊకే సమ్మక్క అనే మహిళ తన ముగ్గురు పిల్లలతో కలిసి అత్తింటి ఎదుట ఆందోళనకు దిగింది. సమ్మక్క తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు పదేళ్ల క్రితం పెద్దల సమక్షంలో ఊకే సతీష్‌ను ప్రేమ వివాహం చేసుకున్నట్లు తెలిపింది. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కొంతకాలంగా కుటుంబంలో విభేదాలు కొనసాగుతున్నాయని, గత ఏడాది నుంచి భర్త అదనపు కట్నం కోసం వేధింపులకు పాల్పడుతున్నాడని ఆమె ఆరోపించింది. అంతేకాకుండా మరో మహిళతో సంబంధం పెట్టుకున్న విషయం ఇంట్లో తెలియడంతో గొడవలు మరింత పెరిగాయని పేర్కొంది.ఈ క్రమంలో తన భర్త తనను కొట్టి ఇంటి నుంచి బయటకు పంపించాడని, తనను చంపుతానంటూ బెదిరిస్తున్నాడని సమ్మక్క వాపోయింది. సమస్యపై పోలీసులను ఆశ్రయించినప్పటికీ తనకు న్యాయం జరగలేదని, పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయతీలు నిర్వహించినా సమస్య పరిష్కారం కాలేదని ఆమె తెలిపింది.దీంతో తీవ్ర ఆవేదనకు గురైన సమ్మక్క తన ముగ్గురు పిల్లలతో కలిసి అత్తింటి ఎదుట పురుగుల మందు డబ్బాతో బైఠాయించింది. తనకు న్యాయం జరగకపోతే పురుగుల మందు తాగి ప్రాణాలు తీసుకుంటానని ఆవేదన వ్యక్తం చేసింది. విషయం తెలుసుకున్న స్థానికులు అక్కడికి చేరుకుని ఆమెకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, సమ్మక్క తల్లి మీడియాతో మాట్లాడుతూ.. తమ కుమార్తెకు ప్రేమ వివాహం సమయంలో సుమారు రూ.10లక్షల నగదు, పది తులాల బంగారం ఇచ్చామని, అదనంగా ఒక వాహనం కూడా కొనిచ్చామని తెలిపింది. ఇంత చేసినప్పటికీ మరింత కట్నం కోసం తమ కుమార్తెను వేధిస్తున్నారని ఆరోపించింది. తమ కుమార్తె, ముగ్గురు పిల్లలకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని ఆమె కోరింది.అయితే ఈ ఆరోపణలపై ఊకే సతీష్ వైపు నుంచి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కుటుంబ వివాదం నేపథ్యంలో మహిళ ముగ్గురు పిల్లలతో కలిసి పురుగుల మందు డబ్బాతో అత్తింటి ఎదుట బైఠాయించిన ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. పోలీసులు ఘటనపై సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు, మహిళ మరియు పిల్లల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# హెడ్ కానిస్టేబుల్ దామోదర్‌బాబుకు పోలీసుల ఆత్మీయ వీడ్కోలు

- సేవలను కొనియాడుతూ ఘనంగా సత్కరించిన ఎస్సై విజయ్ సింహారెడ్డి




**అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 5, (ప్రజా జ్యోతి ):** అన్నపురెడ్డిపల్లి పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా సుదీర్ఘకాలం విధులు నిర్వహించి, బదిలీపై ఖమ్మం జిల్లా కేంద్రానికి వెళ్తున్న బి. దామోదర్‌బాబుకు పోలీస్ సిబ్బంది సోమవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఎస్సై విజయ్ సింహారెడ్డి దామోదర్‌బాబును శాలువాతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.ఈ సందర్భంగా ఎస్సై విజయ్ సింహారెడ్డి మాట్లాడుతూ దామోదర్‌బాబు విధి నిర్వహణలో అంకితభావంతో పని చేస్తూ, ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించారని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో బాధ్యతాయుతంగా వ్యవహరించడంతో పాటు, తోటి సిబ్బందితో కలిసిమెలిసి పనిచేసిన తీరు అభినందనీయమన్నారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో చేపట్టబోయే నూతన విధుల్లోనూ మరింత సమర్థవంతంగా సేవలందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఇనుప పైపుల చోరీ యత్నం

- గ్యాస్ కట్టర్‌తో పైపులు కోసిన ఆరుగురు అరెస్ట్
- ఏఈఈ ఫిర్యాదుతో కేసు.. నిందితులకు రిమాండ్

**అశ్వాపురం అక్టోబర్ 05,ప్రజాజ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వాపురం: సీతారామ ప్రాజెక్టుకు చెందిన ఇనుప పైపులను చోరీ చేసేందుకు యత్నించిన ఆరుగురిని అశ్వాపురం పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ సిలివేరు ఎల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సర్వాయిపాడు గ్రామ పరిధిలోని రాజీవ్ సాగర్ కాలువ సమీపంలో గ్యాస్ కట్టర్ తో భారీ ఇనుప పైపులను కోస్తుండగా అనుమానంతో వారిని అదుపులోకి తీసుకున్నారు.విచారణలో పైపులను కోసి చోరీ చేసేందుకు ప్రయత్నించినట్లు వెల్లడైంది. నిందితులు పోడియం అనిల్ కుమార్, కురసం రాంబాబు, బోళ్ల నరసయ్య, కుంటా శ్రీను, తడకమల్ల ప్రసాద్, కారం నరేష్‌లుగా పోలీసులు గుర్తించారు. సీతారామ ప్రాజెక్టు ఏఈఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్ కు తరలించినట్లు సీఐ తెలిపారు.

# రహదారికి ఇరువైపులా ముళ్లపొదలు, చెట్ల తొలగింపు

- వాహనదారుల ఇబ్బందులకు చెక్ పెట్టిన సర్పంచ్ సోడే మహేశ్వరి



**పాల్వంచ, అక్టోబర్ 5, ప్రజా జ్యోతి:** సూరారం గ్రామపంచాయతీ పరిధిలో ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా సర్పంచ్ సోడే మహేశ్వరి మరో కీలక చర్య చేపట్టారు.గ్రామ పరిధిలోని రహదారికి ఇరువైపులా చెట్లు, ముళ్లపొదలు విపరీతంగా పెరిగిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఎదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం కూడా ఉండేది.ఈ సమస్యను గుర్తించిన సర్పంచ్ సోడే మహేశ్వరి ప్రవీణ్ వెంటనే స్పందించి, జేసీబీ / ట్రాక్టర్ సహాయంతో రహదారికి ఇరువైపులా పెరిగిన చెట్ల కొమ్మలు, ముళ్లపొదలను తొలగించే పనులను దగ్గరుండి పర్యవేక్షించారు.రహదారి ఇరువైపులా ఉన్న అడ్డంకులను తొలగించి, రాకపోకలకు ఇబ్బంది లేకుండా మార్గాన్ని శుభ్రం చేయించారు. దీంతో వాహనదారులకు ఎదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించడంతో పాటు, ప్రయాణం మరింత సురక్షితంగా మారిందని స్థానికులు తెలిపారు.ప్రజ లు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వెంటనే స్పందించి పరిష్కరిస్తున్న సర్పంచ్ సోడే మహేశ్వరి చర్యలపై స్థానిక ప్రజలు, వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

# సేవా సంకల్పంతో ప్రజలకు అండగా బీజేపీ



**ఆళ్ళపల్లి అక్టోబర్5(ప్రజా జ్యోతి )** భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు ఆధ్వర్యంలో సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో సేవలందించిన అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు తాటికొండ శ్రీనివాస చారి మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా 25 సంవత్సరాలుగా అందించిన సేవలను కొనియాడారు.దేశ ప్రధానిగా 13 సంవత్సరాల పరిపాలనలో నిస్వార్థ రాజకీయ నాయకుడిగా ప్రజా సంక్షేమం, దేశాభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తూ సుపరిపాలన అందించారని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా 2047 వరకు వారు తలపెట్టిన వికసిత్ భారత్ లక్ష్యం నెరవేరాలని ఆకాంక్షించారు.మండల అధ్యక్షులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలం నూతన సీఐగా సట్ల రాజు

- బుధ, గురువారాల్లో బాధ్యతలు స్వీకరించే అవకాశం




**భద్రాచలం, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి):** భద్రాచలం టౌన్ నూతన సీఐగా సట్ల రాజును నియమిస్తూ మల్టీజోన్–1 ఐజీపీ సంపత్ చంద్రశేఖర్ రెడ్డి సోమవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం భద్రాచలం టౌన్ సీఐగా పనిచేస్తున్న మెదిపల్లి నాగరాజు బదిలీ నేపథ్యంలో సట్ల రాజును నూతన సీఐగా నియమించారు.నూతన సీఐగా నియమితులైన సట్ల రాజు బుధవారం లేదా గురువారం భద్రాచలం టౌన్ పోలీస్ స్టేషన్ లో బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉన్నట్లు సమాచారం. భద్రాచలం పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడంపై నూతన సీఐపై పట్టణ ప్రజలు ఆశలు వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో ఇటీవల పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలు, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ, గంజాయి అక్రమ రవాణా, రాత్రివేళల్లో భద్రత, దేవస్థానం పరిసరాల్లో పోలీసు పర్యవేక్షణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. నూతన సీఐ బాధ్యతలు స్వీకరించిన అనంతరం పోలీసు అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

- ఏజెన్సీ చట్టంపై గిరిజనేతరులు వేసిన కేసు పై ప్రభుత్వం కౌంటర్ చేయాలి
- ఆదివాసి బిడ్డ శిరీష కుటుంబానికి న్యాయం చేయాలి






**కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 5 , (ప్రజా జ్యోతి )** జీవో నెంబర్ 3 తోపాటు, జీవో నెంబర్ 29 నీ కలిపి ప్రత్యేక చట్టం చేయాలని ఆదివాసి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆదివాసి జేఏసీ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు, ఈ సందర్భంగా పలువురు జేఏసీ నాయకులు మాట్లాడుతూ 1/70 చట్టంపై 1700 మంది గిరిజనేతలు సుప్రీంకోర్టులో వేసిన కేసుపై ప్రభుత్వం వెంటనే కౌంటర్ పిటిషన్ వేయాలని అదేవిధంగా ఏజెన్సీ ప్రాంతంలోని 29 శాఖ లలో ఆదివాసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ఏజెన్సీ ప్రాంతంలో అన్ని ఉద్యోగాలకు సంబంధించి షెడ్యూల్డ్ ఏరియా పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు, ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని, ఆర్వో ఎఫ్ ఆర్ చట్టాలను అమలు చేసి పరిరక్షించాలని వారు డిమాండ్ చేశారు, అదేవిధంగా హైదరాబాదులో అత్యాచారం అత్యంత పాశవీకంగా హత్య చేయబడిన శిరీష కుటుంబానికి న్యాయం చేసి హత్యకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ పూనేం శ్రీనివాస్, వట్టం ఉపేందర్, సోయం సత్యనారాయణ, కన్నం రాజు, ఊకే రవి , ఆరేం ప్రశాంత్, పాయం సత్యనారాయణ, పూణెం సాయి, రమణ ,లక్ష్మయ్య పాల్గొన్నారు.

## కేటీపీఎస్ 8వ దశ విస్తరణకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

- ఉమ్మడి ఖమ్మం జిల్లా మంత్రులు, ఎంపీల ద్వారా సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తాం: కొత్వాల



**పాల్వంచ, అక్టోబర్ 5, ప్రజాజ్యోతి:** పాల్వంచలోని కేటీపీఎస్ విద్యుత్ కర్మాగారంలో 8వ దశ విస్తరణ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వచ్చేందుకు కృషి చేస్తామని డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు.కేటీపీఎస్ 8వ దశ విస్తరణ సాధన కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పాల్వంచలోని స్థానిక ఇంజనీర్స్ అసోసియేషన్ హాల్‌లో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాజకీయ పార్టీలు, అనుబంధ సంఘాలు, కార్మిక సంఘాలు, వర్తక సంఘాలు, కుల సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు.ఈ సందర్భంగా కొత్వాల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పాల్వంచ ప్రాంత అభివృద్ధికి, స్థానిక యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు కేటీపీఎస్ విస్తరణ ఎంతో అవసరమన్నారు. కేటీపీఎస్ 8వ దశ విస్తరణ కోసం అన్ని వర్గాలను కలుపుకొని సమిష్టిగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి, రేణుకా చౌదరి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సహకారంతో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిని కలిసి కేటీపీఎస్ 8వ దశ విస్తరణ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు.పాల్వంచ ప్రాంత ప్రజల ఆకాంక్షగా మారిన కేటీపీఎస్ 8వ దశ విస్తరణ కోసం రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలు ఏకతాటిపైకి రావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో కేటీపీఎస్ 8వ దశ విస్తరణ సాధన కమిటీ నాయకులు జమ్ముల సీతారాం రెడ్డి, మంగీలాల్, సమీర్, డిప్యూటీ మేయర్ లలిత కుమారితో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కే టి పి ఎస్ 7 వ దశ ఉద్యోగులను వేధిస్తున్న ఏవో

- దుర్గ నాగమల్లేశ్వరి





**కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 5, (ప్రజా జ్యోతి )** పాల్వంచలోని స్థానిక కేటీపీఎస్ 7 వ దశ అడ్మినిస్ట్రేషన్ లో జాయింట్ సెక్రెటరీ గా విధులు నిర్వహిస్తున్న కొల్లి దుర్గా నాగమల్లేశ్వరి ఉద్యోగులపై తీవ్ర మానసిక ఒత్తిడి కి గురిచేస్తుంది అని పలువురు కేటీపీఎస్ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు, ఈ ఉద్యోగి వల్ల గతంలో కూడా ఒత్తిడికి గురైన ఒక ఉద్యోగి చనిపోయారని కార్మికులు ఆరోపిస్తున్నారు, నేడు మరో కార్మికుడు పరిస్థితి అలాగే ఉందని, కావున సదరు అధికారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని నేషనల్ అంబేద్కర్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు టి రాజేష్ డిమాండ్ చేశారు.

## ఆపదలో ఉన్న మూగజీవాలకు ‘విక్రమార్కుడి’ అండ

- రామయ్య సన్నిధిలో మూగజీవాలకు కొత్త గూడు
- భద్రాచలంలో గోశాల ఏర్పాటుకు "విక్రమ్ సంకల్పం"



**భద్రాచలం, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి ):** రామయ్య కొలువైన భద్రాచలం పుణ్య క్షేత్రం వీధుల్లో ఆకలితో అలమటిస్తూ, రోడ్లపై తిరుగుతూ ప్రమాదాలకు గురవుతున్న మూగజీవాల దుస్థితి విక్రమ్ సూపర్ మార్కెట్ అధినేత విక్రమ్‌ను కదిలించింది. వాహనాల ఢీకొనడంతో గాయపడి రోడ్ల పక్కన ఆర్తనాదాలు చేస్తున్న గోవులు, ఇతర మూగజీవాలకు శాశ్వత రక్షణ కల్పించేందుకు భద్రాచలంలో ప్రత్యేకంగా గోశాల ఏర్పాటు చేయాలని ఆయన సంకల్పించారు.ఈ మేరకు పట్టణంలోని జంతు ప్రేమికులతో కలిసి విక్రమ్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లపై సంచరిస్తున్న అనేక గోవులు, మూగజీవాలు వాహన ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గాయపడిన జీవాలకు సకాలంలో వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయని తెలిపారు.మూగజీవాలకు నీడ, ఆహారం, తాగునీటితో పాటు అవసరమైన వైద్య చికిత్స అందించేలా గోశాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం ఒక్కరి వల్ల సాధ్యమయ్యేది కాదని, పట్టణ ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారులు, ప్రజలు, జంతు ప్రేమికులు కలిసికట్టుగా సహకరించాలని కోరారు.మూగజీవుల పట్ల చూపే కారుణ్యమే నిజమైన భక్తికి నిదర్శనమని విక్రమ్ పేర్కొన్నారు. పట్టణ ప్రజల సహకారంతో త్వరలోనే గోశాల నిర్మాణాన్ని పూర్తి చేసి రోడ్లపై నిరాశ్రయంగా తిరిగే మూగజీవాలకు సురక్షితమైన ఆశ్రయం కల్పిస్తామని స్పష్టం చేశారు.మూగజీవుల రక్షణ కోసం విక్రమ్ ముందుకు రావడంపై పట్టణ ప్రజలు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో సాగర్ ఎలక్ట్రికల్స్ అధినేత సాగర్, శర్మ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## 32 పోయిన మొబైల్ ఫోన్లు రికవరీ

- సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించిన భద్రాచలం పోలీసులు
- పోలీసుల పనితీరుపై హర్షం వ్యక్తం చేసిన బాధితులు



**భద్రాచలం, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి ):** పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ సందర్భాల్లో పోయిన 32 మొబైల్ ఫోన్లను పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రికవరీ చేశారు. రికవరీ చేసిన ఫోన్లను సోమవారం భద్రాచలం డీఎస్పీ ఎం. అరుణ్ కుమార్ చేతుల మీదుగా సంబంధిత బాధితులు, యజమానులకు అప్పగించారు.మొబైల్ ఫోన్లు పోయినట్లు అందిన ఫిర్యాదుల మేరకు వాటి వివరాలను సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసిన పోలీసులు, సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో ఫోన్ల ఆచూకీని గుర్తించారు. అనంతరం 32 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు తిరిగి అందజేశారు. తమ ఫోన్లను తిరిగి పొందిన బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా డీఎస్పీ ఎం. అరుణ్ కుమార్ మాట్లాడుతూ ప్రజలు మొబైల్ ఫోన్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా రద్దీ ప్రాంతాలు, మార్కెట్లు, బస్సులు, రైల్వే స్టేషన్లు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో మొబైల్ ఫోన్లను వినియోగించే సమయంలో జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఫోన్లను నిర్లక్ష్యంగా ఎక్కడపడితే అక్కడ ఉంచవద్దని సూచించారు.మొబైల్ ఫోన్ పోయినా, చోరీకి గురైనా వెంటనే పోలీసులకు సమాచారం అందించి ఫోన్‌కు సంబంధించిన ఐఎంఈఐ నంబర్‌తో పాటు ఇతర వివరాలను అందించాలని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగిస్తూ పోయిన మొబైల్ ఫోన్లను రికవరీ చేసేందుకు పోలీసులు నిరంతరం చర్యలు చేపడుతున్నారని డీఎస్పీ పేర్కొన్నారు.

## సోమవారం శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో విశేష పూజలు

- రుద్రాభిషేకం, నాగహారతికి అధిక సంఖ్యలో హాజరైన భక్తులు
- మహేష్-వెంకట నాగలక్ష్మి దంపతులు, హెచ్‌సీఎల్ కంపెనీ ఆధ్వర్యంలో అన్నదానం







**అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 5, (ప్రజా జ్యోతి ):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి పాలు, తేనె, కొబ్బరికాయ తదితర పూజా ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం విశేషంగా మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం నాగహారతి నిర్వహించగా భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది.ఆలయానికి విచ్చేసిన భక్తుల కోసం సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కొత్తగూడెం గ్రామానికి చెందిన పాంచాన పరుపు మహేష్–వెంకట నాగలక్ష్మి దంపతులు కుటుంబ సమేతంగా, హెచ్‌సీఎల్ కంపెనీ వారు కలిసి అన్నదానాన్ని ఏర్పాటు చేసి భక్తులకు భోజనం వడ్డించారు. ఆలయ సిబ్బంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసి, పూజా కార్యక్రమాలు సజావుగా జరిగేలా చర్యలు చేపట్టారు. భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ క్రమబద్ధంగా దర్శనం జరిగేలా సహకరించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, నాగహారతి, అన్నదాన కార్యక్రమాలతో భక్తుల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

## కాంట్రాక్ట్ కార్మికులకు పెరిగిన బెనోవాలెంట్ ప్రయోజనాలు

**బూర్గంపహాడ్, అక్టోబర్ 05 (ప్రజా జ్యోతి ):** ఐటీసీ పీఎస్ పీడీ యూనిట్ భద్రాచలంలో కాంట్రాక్ట్ కార్మికులకు రిటైర్మెంట్ ,డెత్ బెనోవాలెంట్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.గుర్తింపు సంఘం టీఎన్ టీయూసీ,మిత్రపక్షాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు కాంట్రాక్ట్ కార్మికులకు పెంచిన మొత్తాలతో కూడిన చెక్కులను అందజేశారు.కాంట్రాక్ట్ కార్మికుల కంట్రిబ్యూషన్ తో నిర్వహిస్తున్న బెనోవాలెంట్ ఫండ్ లో భాగంగా ఇప్పటివరకు రిటైర్మెంట్ బెనిఫిట్ గా రూ.1.50 లక్షలు అందజేస్తుండగా,దీనిని రూ.2 లక్షలకు పెంచారు. అదేవిధంగా డెత్ బెనోవాలెంట్ ఫండ్ ను ప్రస్తుతం ఉన్న రూ.4 లక్షల నుంచి రూ.4.50 లక్షలకు పెంచారు.కాంట్రాక్ట్ కార్మికుల బెనోవాలెంట్ ఫండ్ కమిటీ నిర్ణయం మేరకు పెంచిన మొత్తాలతో కూడిన చెక్కులను సంబంధిత కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.గుర్తింపు సంఘం అధ్యక్షుడు కనకమేడల హరిప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హెచ్ ఆర్ మేనేజర్లు చాంద్ పాషా,వెంకట రామారావు,మురళి,సౌరబ్ ముఖర్జీ పాల్గొన్నారు. అలాగే బెనోవాలెంట్ ఫండ్ కమిటీ సభ్యులు పాకాలపాటి దుర్గాప్రసాద్,పీవీ చందు, గాదే రామ కోటిరెడ్డి,సముద్రాల అనిల్ కుమార్,గుర్తింపు సంఘ కార్యవర్గ సభ్యులు,కాంట్రాక్ట్ కార్మిక సంఘ నాయకులు నరేంద్ర, నిరంజన్,సోమిరెడ్డి, వెంకటరెడ్డి,సర్వేశ్వరరావు,సతీష్ తదితరులు పాల్గొన్నారు.కాంట్రాక్ట్ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బెనోవాలెంట్ ప్రయోజనాలను పెంచడం పట్ల కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.రిటైర్మెంట్ సమయంలో,అలాగే అనుకోని పరిస్థితుల్లో కార్మికుల కుటుంబాలకు ఈ నిధులు ఆర్థికంగా కొంత భరోసా కల్పిస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు.